## వైద్యసాయానికి 'సీఎంఆర్ఎఫ్' దోహదం



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**జవహర్‌నగర్, ఆగస్టు 3:** వైద్యసాయం కోసం సీఎంఆర్ఎఫ్ నిధి దోహదపడుతుంది ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు చెందిన బాధిత కుటుంబాలకు మాజీ మేయర్ మేకల కావ్య ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్షంలో చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంగీతారాజశేఖర్, సతీష్‌కుమార్, పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, నర్సింహాయాదవ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలను నాటి పర్యావరణాన్ని రక్షించాలి



నాగారం మున్సిపాలిటీలో చైర్మన్ చంద్రారెడ్డితో కలిసి మొక్క నాటుతున్న ఎంపీ ఈటల రాజేందర్

**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 3:** మొక్కలను నాటి పర్యావరణాన్ని రక్షించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నాగారం మున్సిపాలిటీ 14వ వార్డు శివశంకర్ నగర్ కాలనీలో శనివారం వనమహోత్సవంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డితో కలిసి ఈటల మొక్కలను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేందర్‌కుమార్, మేనేజర్ చంద్రశేఖర్, డీఈ రఘు, కౌన్సిలర్లు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మి, లావణ్య, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మర్రి దీపికానర్సింహారెడ్డి

**మేడ్చల్, ఆగస్టు 3 :** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో శనివారం రూ.3.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను చైర్‌పర్సన్ మర్రి దీపికానర్సింహా రెడ్డి, కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తూ పట్టణాన్ని అభివృద్ధి చేశామన్నారు. అనంతరం వార్డు ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ జ్ఞానేశ్వర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మర్రి నర్సింహ రెడ్డి, మున్సిపాలిటీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధే లక్ష్యం

**రామంతాపూర్,జూలై 3:** హబ్సిగూడ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా తాను కృషి చేస్తున్నానని డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీశ్ అన్నారు. శనివారం డివిజన్‌లోని వీధినంబర్ 8లో ఉన్న వెలుగుట్ట ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆలయంలో ఉన్న యాగశాలను పరిశీలించారు.విద్యుత్ స్తంభాలు అడ్డంగా ఉన్నాయని కార్పొరేటర్‌కు తెలిపారు.వెంటనే స్పందించిన కార్పొరేటర్ ఎలక్ట్రికల్ అధికారులను పిలిచి స్తంభాలను తొలగించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఈ రాంరెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

**మేడ్చల్, ఆగస్టు 3:** తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ టీచర్లు జయప్రభ, శకుంతల, అనురాధ అన్నారు. శామీర్‌పేట మండలం ఆలియాబాద్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లి పాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పారిజాత, చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

**మేడ్చల్ కలెక్టరేట్:** తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని కౌన్సిలర్ అనిత అన్నారు. నాగారం మున్సిపాలిటీ 9వ వార్డులో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతను ఐసీడీసీ సూపర్‌వైజర్ యశోద వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ ఇండ్లను అందుబాటులోకి తెస్తాం



రాజీవ్ స్వగృహ సముదాయాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న సీడీఎంఏ డైరెక్టర్ గౌతమ్

జవహర్‌నగర్, ఆగస్టు 3: రాజీవ్ స్వగృహ ఇళ్లను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేసేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని అధికారులు, పాలక వర్గానికి సీడీఎంఏ డైరెక్టర్ గౌతమ్ సూచించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో సీడీఎంఏ గౌతమ్, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తాలు స్థానిక పాలక వర్గంతో కలిసి డంపింగ్ యార్డ్, రాజీవ్ స్వగృహ ఇళ్లను, నర్సరీలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడతూ డంపింగ్ దుర్వాసన వెదజల్లకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, పవర్ ప్లాంట్ పనితీరు ఎలా ఉందని? రాంకీ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. వరంగల్‌లో కూడా మరో ప్లాంటు విషయంపై చర్చించారు. జీవో 59 కింద రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి ఇంటి అనుమతులు ఎందుకు ఇవ్వడంలేదని డీపీవోని ప్రశ్నించారు. వాటికి సంబంధించి ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే వెంటనే పరిష్కారం చేస్తామన్నారు. రాజీవ్ గృహకల్ప ఇళ్లను ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టలాని, 100 శాతం పన్నులు వసూలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి, తహసీల్దార్ సుచరిత, పలువురు కార్పొరేటర్లు,మున్సిపల్,రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

# ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి



ఆర్డీవోలు,తహసీల్దార్లతో ధరణి సమస్యలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 3:** పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం రెవెన్యూ అధికారులతో ధరణి దరఖాస్తులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్, రెవెన్యూ ఆర్డీవో స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వారం, పది రోజుల్లో పరిష్కరించాలని, సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలని, వక్ఫ్, ఇనాం, డిఫెన్స్ భూములు, నిషేధించబడిన భూముల్లో ఉన్న దరఖాస్తులను తిరస్కరించాలని సూచించారు. ధరణి దరఖాస్తులపై ప్రతి రోజూ సమీక్షించాలని ఆర్డీవోలకు కలెక్టర్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజలు సమర్పిస్తున్న అర్జీలను ఆయా శాఖలకు బదిలీ చేస్తున్నారని వాటికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీలను తిరస్కరిస్తే అందుకు గల కారణాలను పొందుపర్చాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకు ముందు సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ కలెక్టర్లుతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధరణి, ఆర్ఓఆర్ బిల్లుపై సమీక్ష నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్, అదనను కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**లే అవుట్ల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలి**

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణపారదర్శకంగా చేపట్లాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడుతూనే, ప్రభుత్వ అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణను మూడుదశల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను చేపట్టేందుకు వీలుగా రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, పంచాయతీ అధికారులతో కమిటీలను రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.క్రమబద్ధీకరణపై జిల్లా, మండల, మున్సిపాలిటీ పరిధిల్లో అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని అన్నారు.

### అధికారులకు కలెక్టర్ ఆదేశం

**పచ్చదనం,స్వచ్ఛదనం విజయవంతం చేయాలి**

ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే పచ్చదనం-స్వచ్ఛదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వీధికుక్కల బారి నుంచి ప్రజలను కాపాడే బాధ్యత అందరిపై ఉందని, కుక్కలు జనావాసల మధ్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లను, క్రీడా స్థలాలుగా రూపొందించాలని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనుమతి లేని భవనాలను గుర్తించి వాటిని కుల్చివేయాలని, అదనంగా నిర్మించిన భవనాలకు ప్రభుత్వ విధానాలకు ప్రకారం పన్ను విధించాలని అన్నారు. అంతకు ముందు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, పురపాలకు, పట్టణాభివృద్ధి ప్రధాన కార్యదర్శి దానకిశోర్, ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో ఎల్ఆర్ఎస్ విధి విధానాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్, సీడీఎంఎ వీ.పీ. గౌతమ్,అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్ రెడ్డి, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యను అందించాలి



నాచారం స్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**రామంతాపూర్,జూలై 3:** విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు విద్యను అందించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాఠశాల యజమాన్యానికి సూచనలిచ్చారు. శనివారం నాచారం జాన్ వెస్లీ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యే విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కష్టపడి చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఎలిఫెంట్ చౌరస్తాకు అత్యాధునిక హంగులు**

**మల్లాపూర్:** మల్లాపూర్ డివిజన్ ఎలిఫెంట్ చౌరస్తా వద్ద మహనీయుల విగ్రహాల ముందు కూడలిని కోటి పదమూడు లక్షలు, రామానుజ సర్కిల్ వద్ద రూ.65 లక్షలతో అత్యాధునిక హంగులతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నానక్‌రామ్‌గూడ, కొండాపూర్‌లోని పలు కూడలిని పరిశీలించారు. మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తా అలాగే పచ్చదనంతో గార్డెనింగ్, పుట్ పాత్, అత్యాధునిక హంగులతో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ స్రవంతి, స్థానిక నాయకులు వాసుగౌడ్, ఫైళ్ల ప్రవీణ్, దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

**మేడ్చల్, ఆగస్టు 3:** విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆకాంక్షించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ స్నాతకోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన ఇంజినీర్లకు దేశ, విదేశాల్లో డిమాండ్ ఉందన్నారు. విద్యార్థులు ఉద్యోగం సంపాదించడం ఒక్కటే ధ్యేయంగా కాకుండా పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. కళాశాల నుంచి నేరుగా పరిశ్రమకు వెళ్లే పని చేసే నైపుణ్యాలను సొంతం చేసుకుంటే సులభంగా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. సీఎంఆర్‌లో చదివిన విద్యార్థులు ఎంతో మంది విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం విజయవంతంగా ఇంజినీరింగ్ పూర్తి చేసిన 812 మంది విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ విద్యా సంస్థల కార్యదర్శి గోపాల్ రెడ్డి, సభ్యులు శ్రీశైలం రెడ్డి, భూపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ వీఏ నారాయణ, సీఈవో అభినవ్ రెడ్డి, ఏవీయన్ కంపెనీ మేనేజర్ ప్రశాంతి నిడమర్తి, సీడాక్ జాయింట్ డైరెక్టర్ శ్రీకాంత్, ఎంసీఈఎంఈ ఈఈ అశోక్ పాండా, ఎన్‌సీసీ ఆఫీసరుల అశుతోష్ గుప్తా, లెఫ్టినెంట్ కల్నల్ అనంద రావు పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

**కాప్రా,ఆగస్టు 3:** జీహెచ్ఎంసీలో విధులు నిర్వహించే ఔట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాప్రా సర్కిల్ బీఆర్ఎస్‌కేవీ అధ్యక్షులు కూర్మన్న జీహెచ్ఎంసీ మేయర్, కమిషనర్లకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. జీహెచ్ఎంసీలో 20ఏండ్లుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులు ఉద్యోగ భద్రత కరువై, పేదరికంతో అవస్థలు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలు సత్వరం పరిష్కరించి న్యాయం చేయాలని ఈ సందర్భంగా కూర్మన్న నగర మేయర్‌కు, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అందజేసిన వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని,కార్మికులు అకాలంగా మరణిస్తే రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, మున్సిపల్ కార్మికులకు ఇందిరా ఆవాస్ యోజన పథకంలో ఇండ్లు ఇవ్వాలని ముఖ్యమైన పండుగల్లో ఒక పూట సెలవు ఇవ్వాలని కోరారు. కార్మికులకు అవసరమైన పనిముట్లను సమకూర్చాలని, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలనికూర్మన్న తన వినతిపత్రంలో కోరారు.

## గంజాయి విక్రేతలు అరెస్టు

**మల్కాజిగిరి, ఆగస్టు 3:** గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అరెస్టు చేసిన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. డీఐ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ గౌడ్ కథనం ప్రకారం.. అల్వాల్‌కు చెందిన అంజనిదూబే, బోరబండకు చెందిన ఉత్తంకుమార్ ఉపాధ్యాయ సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. ఇద్దరు స్నేహితులు. జల్సాలకు అలవాటుపడి డబ్బు కోసంగంజాయిని అమ్ముతున్నారు. అల్వాల్‌లో అనుమానాస్పదంగా తీరుగుతుండగా పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో గంజాయి అమ్ముతున్నట్లు ఒప్పుకునారు.వారి నుంచి నాలుగు కిలోల గంజాయి, బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని ఇద్దరి రిమాండ్‌కు తరలించారు.

## డెలివరీ బాయ్ అదృశ్యం



జనార్దన్ (ఫైల్)

**మల్కాజిగిరి, ఆగస్టు 3:** స్విగ్గి డెలివరీ బాయ్ అదృశ్యమైన సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం... శివపురికాలనీకి చెందిన జనార్దన్(30) స్విగ్గి సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. గతనెల 27న ఉదయం పనికి వెళ్లాడు. రాత్రికి ఇంటికి రాలేదు. ఆయన కోసం కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో తండ్రి సంజీవరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు

**మేడ్చల్, ఆగస్టు 3:** మేడ్చల్‌లో శనివారం జాతీయ రహదారిపై ట్రాఫిక్ పోలీసులు ఆటోల తనిఖీ చేపట్టారు. ఎస్సై పరశురాం, ఏఎస్సై కృష్ణ ఆధ్వర్యంలో ఆటోలను తనిఖీ చేసి, నంబరు ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాటిని గుర్తించారు. ఆ ఆటోల డ్రైవర్లను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ హనుమాన్ గౌడ్ కౌన్సెలింగ్ నిర్వహించి, జరిమానా విధించారు.

## మౌలిక వసతులు కల్పిస్తాం: ఎమ్మెల్యే



మచ్చ బొల్లారం డివిజన్ పెద్దిపరమారెడ్డి కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, ఆగస్టు 3:** ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం మచ్చబొల్లారం డివిజన్ పెద్దిపరమారెడ్డి కాలనీలో రూ.24 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణపనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపాలు జరుగకుండా అధికారులు పనులను పరిశీలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, రమేష్, అనిల్‌కిశోర్, పరమేష్, పవన్, మహేష్, ప్రశాంత్‌రెడ్డి, శోభన్, జావేద్, సులోచన, హరిత, బంటి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం..**

పేదల మెరుగైన ఆరోగ్య సేవలు అందజేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మెరుగైన చికిత్స కోసం వెంకటాపురం డివిజన్‌కు చెందిన సత్యశీలా శోభారాణికి రూ.48వేలు, విజయకు రూ.33వేల సీఎంఆర్ సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే మర్రి వారికి అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు వెంకన్న, అనిల్‌కిశోర్, సుధాకర్, రాం, రాజు, సురేష్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆంత్రప్రెన్యూనర్లుగా ఎదగాలి

**మేడ్చల్, ఆగస్టు 3:** విద్యార్థులు ఆంత్రపెన్యూనర్లుగా ఎదగాలని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత అన్నారు. కళాశాలలో శనివారం 'స్టార్టప్ ఫండింగ్ అండ్ వెంచర్ క్యాపిటల్ ఫండింగ్' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు వస్తే సహాయ సహకారాలు అందించడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ నిధులు అందజేస్తుందన్నారు. సార్టప్ ఏకో సిస్టమ్ ఎనేబుల్ మేనేజర్ గౌరవ గుప్తా మాట్లాడుతూ కొత్త ఉత్పత్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేటప్పుడు ప్రజల ఆలోచనలకు అనుగుణంగా అదించడం ముఖ్యమన్నారు. పంట పొలాల్లో క్రిమిసంహారక మందు లు పిచికారి చేయడానికి రైతులకు ఎక్కువ సమయం పడుతుందని, దానికి అనుగుణంగా ఆంత్రప్రెన్యూర్ ఆలోచించి, డ్రోన్స్ తయారు చేయాలని సూచించారు. వరిగడ్డితో పుట్టగొడుగులు తయారు చేయడం వల్ల వరిగడ్డిని కాలిస్తే వచ్చే కాలుష్యాన్ని నివారించవచ్చున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలోనూ స్టార్టప్‌గా ఎలా ప్రారంభించవచ్చనే విషయాన్ని వివరించారు. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో 78 ఇంక్యుబెటర్ రిజిస్టర్ అయి ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సరోజారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల చదువులకు అండగా ఉంటాం



కౌకుర్‌లోని ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు బ్యాగులను అందజేస్తున్న ఇన్ఫోసిస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమా కందాల

మల్కాజిగిరి, ఆగస్టు 3: పేద విద్యార్థుల చదువులకు అండగా ఉంటామని ఇన్ఫోసిస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమా కందాల అన్నారు. శనివారం అల్వాల్ సర్కిల్ కౌకూర్‌లోని ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు ప్రాజెక్ట్ డైరెక్టర్ బ్యాగ్స్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీకృష్ణమూర్తి, టీచర్లు పారిజాత, స్వప్న, సంగీత, భారతీ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి గంగపుత్రుల బోనాలు



మహాత్మాగాంధీనగర్‌లోని భూ లక్ష్మి అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న గంగపుత్రులు

**మల్కాజిగిరి, ఆగస్టు 3:** అమ్మవారికి గంగపుత్రులు సామూహిక బోనాలను సమర్పించారు. శనివారం మచ్చ బొల్లారం మహాత్మాగాంధీనగర్‌లోని భూలక్ష్మి అమ్మవారికి గంగపుత్రులు బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సురేష్ సేవా సమితి చైర్మన్ నర్ల సురేష్, ప్రవళిక, సరిత, సత్యమ్మ, లలిత, భాగ్యలక్ష్మి, యాదమ్మ, ఈశ్వరమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుడు అదృశ్యం

మల్కాజిగిరి, ఆగస్టు 3: వృద్ధుడు అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం... మౌలాలి ఆర్టీసీ కాలనీకి చెందిన షేక్‌అన్వర్ (64) కొంత కాలంగా ఆనారోగ్యంతో చికిత్స పొందుతుంది. గత నెల 16న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రికి ఇంటికి రాలేదు. దీంతో ఆయన కోసం వెతికినా ఆచూకి దొరక లేదు. దీంతో కుమారుడు షేక్‌సల్మాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు కింద పడి వ్యక్తి మృతి

మేడ్చల్, ఆగస్టు 3: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి గ్రామంలో జరిగింది. గౌడవెల్లి గ్రామంలో రైల్వే స్టేషన్‌కు చేరుకున్న గుర్తు తెలియని వ్యక్తి శనివారం నడుస్తున్న రైలును ఎక్కబోయి ప్రమాదవశాత్తు రైలు చక్రాల కింద పడి మృతి చెందాడు.

## నల్లాలను చోరీ చేసిన వ్యక్తి రిమాండ్

**ఘట్‌కేసర్,ఆగస్టు3:** ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి చోరబడి నల్లాను చోరీ చేసిన వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఘట్‌కేసర్ బ్రూక్‌బాండ్ కాలనీలోకి చెందిన జనార్దన్ కుటుంబ సభ్యులతో ఈనెల1న బంధువుల ఇంటికి వెళ్లాడు. 2న రాత్రి ఇంట్లో నల్లాను తొలగిస్తున్న శబ్దం రావడంతో జనార్దన్ పక్క ఇంటి వ్యక్తులు ఫోన్ చేసి చెప్పారు.బాధితుడు వచ్చి ఇంటిని పరిశీలించగా,ఇంట్లోని పది నల్లాలను దొంగిలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు గాలింపు చేపట్టగా వరంగల్ బైపాస్ రోడ్డులో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లుగా గుర్తించారు. మైసమ్మ గుట్టకు నివాసం ఉండే గంట రమేష్‌రెడ్డి వద్ద ఉన్న సంచిలో పది నల్లాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంబురాలు

**కాప్రా, ఆగస్టు 3:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వెలువరించడం పట్ల పలు ప్రాంతాల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. డివిజన్ న్యూ ఇందిరానగర్ బస్తీలో అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం అంబేద్కర్ విగ్రహానికి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏ.శ్రీనివాస్, భిక్షపతి, బీపీఎం స్వామి, శివలింగం, దశరథ, శివయ్య, పోచయ్య, కృష్ణ, శ్రీను మోచ, పెంటయ్య, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

## రేపటి నుంచి స్వచ్ఛదనం-పచ్చదనం

**మేడ్చల్,ఆగస్టు3:** మేడ్చల్ మండలంలో గ్రామ పంచాయతీల్లో 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని ఈ నెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వసంతలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకొని,విజయవంతం చేయాలని కోరారు.

## 8నుంచి సదరం క్యాంపులు

**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 3:** ఆగస్టు 8, 22, 29వ తేదీల్లో మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం క్యాంపులను నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపునకు వచ్చే దివ్యాంగులు మీ సేవ ద్వారా బుక్ చేసుకున్న సదరం స్లాట్ రసీదు, ఆధార్ కార్డు జిరాక్స్, లేటెస్ట్ రిపోర్ట్స్‌తో ఉదయం 10 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. ఈ నెల 5వ తేది నుండి మీ సేవ కేంద్రాలలో సదరం స్లాట్స్ అందుబాటు ఉంటాయని అన్నారు.

## కలెక్టర్‌కు వినతి

**మేడ్చల్ రూరల్, ఆగస్టు 3:** గ్రామ ప్రజల అభిప్రాయం తీసుకోకుండా మండలంలోని పూడూర్ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలుపకూడదని ఆ గ్రామ మాజీ సర్పంచ్ బాబు యాదవ్ కలెక్టర్‌కు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీకి వినతి పత్రం అందజేశారు. ఓఆర్ఆర్‌కు వెలుపల ఉన్న పూడూర్ గ్రామాన్ని మేడ్చల్ మున్సిపాలిటిలో కలిపి తదనంతరం జీహెచ్ఎంసీలో విలీనం చేస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయని, కాని గ్రామప్రజల అభిప్రాయాన్ని తీసుకోకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోరాదని విజ్ఞప్తి చేశారు. ప్రజాభిప్రాయ మేరకు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## పాఠశాలకు కార్పెట్లు వితరణ

**పీర్జాదిగూడ, ఆగస్టు 3:** పీర్జాదిగూడ కార్పొరేషన్ మేడిపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ జక్క వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు మ్యాట్( కార్పెట్లు)లను వితరణ చేశారు. అనంతరం 25వ డివిజన్ శ్రీ సాయినగర్, విహారిక కాలనీలలో కార్పొరేటర్ హరిశంకర్ సొంత నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లను మేయర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, సత్యప్రసాద్, ఉపాధ్యాయులు, నాయకులు, కాలనీ ప్రతినిధులు.

## ఆస్తిపన్ను చెల్లించండి

**కాప్రా,ఆగస్టు3:** ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కోరారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో డీసీ మాట్లాడుతూ ఏండ్లుగా ఆస్తి పన్నులు,బకాయిలు చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేశామన్నారు. కాప్రాసర్కిల్‌లో ఈ ఏడాదికి ఆస్తిపన్ను లక్ష్యం రూ.69.53 కోట్లు వసూలు చేయా ల్సి ఉండగా,ఇప్పటి వరకు బిల్‌కలెక్టర్లు, ఆన్‌లైన్ చెల్లింపులద్వారా రూ.37.11 కోట్లు వసూలు చేసినట్టు తెలిపారు. సకాలంలో ఆస్తిపన్నులు చెలించకుంటే వాటికి పెనాల్టీలు చెల్లించాల్సి ఉంటుందని అన్నా రు. ఎప్పటికప్పుడు ఆస్తిపన్ను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఘట్‌కేసర్ డీటీగా రాజేందర్

**ఘట్‌కేసర్,ఆగస్టు3:** ఘట్‌కేసర్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా రాజేందర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు ఎప్పటి కప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

## మల్కాజగిరి సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరణ

**నేరేడ్‌మెట్, ఆగస్టు 3 :** మల్కాజిగిరి రిజిస్ట్రేషన్ కార్యాలయ సబ్ రిజిస్ట్రార్‌గా ఆర్. శ్రీకాంత్ శనివారం బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన బాధ్యతలు చేపట్టగా కార్యాలయ ఉద్యోగులతో పాటు డాక్యుమెంట్ రైటర్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా నూతన సబ్ రిజిస్ట్రార్ శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

**మేడ్చల్, ఆగస్టు 3:** పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులకు కృషి చేయాలని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత అన్నారు. శనివారం కళాశాల ఆధ్వర్యంలో గో గ్రీన్ ప్లాంటేషన్ పేరుతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుండ్లపోచంపల్లి, అయోధ్యనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారుకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇన్‌చార్జి బీవీఎస్‌పీ పవన్‌కుమార్, డీన్‌లు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HONBLE XI JUNIOUR CIVIL JUDGE, CCC, AT : SECUNDERABAD**
O.S. NO.122 OF 2024
Between
Dasari Varalakshmi ...Plaintiff
And
Kurakula Shankar, Kurakula Padma ...Defendents
Both are R/o H.No.8/490, jyothi Colony, Jaibhajrangnagar, Balajinagar Medchal-Malkajgiri dist-500058
**NOTICE**
It is here by inform that a money Recovery Suit vide OS NO.122 of 2024 has been failed by the Plaintiff and is coming up for your appearance on date:21/08/2024 before the Hon'ble Court.Hence this Notice.
Sd/- **G Bhasker,** Advocate
H.No.1-5-1159,Maruthi Nagar, Kothapet Dilsukhnagar, Hyderabad.